# రూ.10 కోట్లతో న్యాక్ భవన నిర్మాణం



సిద్దిపేటలో న్యాక్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

- పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలి
- మే నెలలో శిక్షణ తరగతులు ప్రారంభించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 12: సిద్దిపేటలోని కరీంనగర్ వెళ్లే రోడ్డులో నిర్మించిన న్యాక్ భవనాన్ని శనివారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లా నిర్మాణరంగ నిరుద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించేందుకు సిద్దిపేటలో న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా ఇందులో శిక్షణ ఇస్తారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేయడంతో జీప్లస్‌టూ విధానంలో దీనిని నిర్మాణం చేసినట్లు తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో హాల్, ఫస్ట్ ఫ్లోర్‌లో డైనింగ్‌హాల్, టాయిలెట్స్, రెండో అంతస్తులో క్లాస్‌రూమ్స్, శిక్షణార్థులకు వసతి గృహం వంటి సౌకర్యాలతో భవనం నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే మోడల్‌గా సిద్దిపేట న్యాక్ భవనం నిర్మాణం జరిగిందని, దీనిని నెలాఖరు వరకు అందుబాటులోకి తేవాలన్నారు. న్యాక్ భవనం అందుబాటులోకి వస్తే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్) సెంటర్‌లో ఎల్‌అండ్‌టీ సంస్థ ఏటా 300 మంది నిర్మాణ రంగ కార్మికులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మే నెలలో శిక్షణ తరగతులు ప్రారంభం కావాలని, మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను హరీశ్‌రావు ఆదేశించారు.

# బాధిత కుటుంబాన్ని ఓదార్చిన హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 12: మండల కేంద్రమైన చిన్నకోడూరుకు చెందిన యువకుడు రేపాక రోహిత్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రేపాక రోహిత్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 12: మహనీయుల స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని, వారి ఆశయాలకు అనుగుణంగా యువత కదలాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఎర్రవల్లిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దృఢత్వానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. ఈ క్రీడల్లో జిల్లా స్థాయిలో 26 మండలాల నుండి పురుషులు, మహిళలు, రాష్ట్ర స్థాయిలో 10 జిల్లాల నుండి ఆహ్వానిత జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్సీ సంతోష్‌కుమార్, మాజీ జడ్పీటీసీ మల్లేశం, మాజీ కౌన్సిలర్ శ్యామల, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, యాదగిరి, నవీన్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.


# ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు

నారాయణరావుపేట, ఏప్రిల్ 12: పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన మండల పరిధిలోని మాటిండ్లలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామసభలో తీర్మానం చేసి ఎంపిక చేసినవారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించి, తమకు ఇండ్లు మంజూరు పత్రాలు అందజేయాలని కోరుతూ శనివారం గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులు మాట్లాడుతూ.. గ్రామసభలో 18 మందిని అర్హులుగా ఎంపిక చేశారని, వీరిలో నలుగురి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని అధికారులు వివరించారని తెలిపారు. మరో 14మంది పేర్లు నమోదు కాకపోవడంతో తమకు మంజూరు పత్రాలు రావడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు బాలవ్వ, శాంతవ్వ, నరసయ్య, బాలలక్ష్మి, చంద్రకళ, లావణ్య పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విజేందర్

కొమురవెల్లి, ఏప్రిల్ 12: మండలంలోని ఐనాపూర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ పబ్బోజు విజేందర్ తన అమ్మ నాన్న అనసూయరాజయ్య జ్ఞాపకార్థం శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ప్రతియేడు తన తల్లిదండ్రుల పేరిట చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నానని, బాటసారులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణాగౌడ్, జయరాములు, గోపాల్‌రెడ్డి, ఇస్తారి తదితరులు ఉన్నారు.

# తొగుటలో ఆరోగ్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న కొండల్‌రెడ్డి, వైద్య సిబ్బంది

తొగుట, ఏప్రిల్ 12: మండల కేంద్రమైన తొగుటలో మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ దవాఖాన సౌజన్యంతో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 300 మంది వ్యాధిగ్రస్తులకు హెల్త్ చెకప్ చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో భరత్‌తేజ, యాదవరెడ్డి, అనిల్‌కుమార్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

# మురుగు పారకుండా చర్యలు తీసుకోండి

- కమిషనర్‌కు కాలనీ వాసులు, రైతుల మొర



డ్రైనేజీలో నిల్చొని సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్న రైతు యాదగిరి

చేర్యాల, ఏప్రిల్ 12: పట్టణం నుంచి వస్తున్న మురుగుతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల పట్టణంలోని శివాజీనగర్ కాలనీ వాసులు శనివారం మున్సిపల్ కమిషనర్ నాగేందర్‌ను కలిసి మురుగునీరు పారకుండా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. పట్టణం నుంచి వస్తున్న మురుగుతో తమ పంటలు నాశనమవుతున్నాయని పలువురు రైతులు వాపోయారు. ఆరేళ్లుగా పంటపొలాలు, ఇండ్లల్లోకి మురుగు వస్తున్నదని, దానిని తొలిగించాలని సంబంధితశాఖ అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదన్నారు. మురుగు రావడంతో తాము జబ్బుల బారిన పడుతున్నామని కాలనీ వాసులు వాపోయారు. విషసర్పాలు సైతం సంచరిస్తున్నాయని, దుర్గంధం వెదజల్లుతున్నదని తెలిపారు. ఆరెకరాలకు పైగా పంట మునిగిపోతున్నదని తెలిపారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు.

# హనుమంతుడు సర్వ జగద్రక్షకుడు



సిద్దిపేట: హనుమాన్ పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



గజ్వేల్: హనుమాన్ ర్యాలీలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



కుకునూరుపల్లి: ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల నాయకులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 12: హనుమంతుడు బలశాలి అని, హనుమ సర్వజగద్రక్షకుడు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం హనుమాన్ విజయోత్సవం సందర్భంగా సిద్దిపేటలో రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో జరిగిన హనుమాన్ మాలధారణ స్వాముల భిక్షా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన పలకీ సేవలో ఆయన హనుమాన్ మాలాధారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ హనుమాన్ సర్వ జగత్ రక్షకుడన్నారు. స్వామివారి అనుగ్రహంతో శుభం కలగాలని కోరుకున్నట్లు తెలిపారు.

**మిరుదొడ్డిలో...**

మిరుదొడ్డి, ఏప్రిల్ 12: మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌లో శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ మాల ధరించిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టౌన్ పురోహితుడు విఠాల రాజపున్నయ్య, హనుమాన్ మాల వేసిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో..**

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 12: పట్టణంలోని పాటిమీద హనుమాన్, మరకత శివాలయంలో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, రాజిరెడ్డి, కైలాసం, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, కిరణ్, హేమలత పాల్గొన్నారు.



మర్కూక్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు

**గజ్వేల్‌లో..**

గజ్వేల్, ఏప్రిల్ 12: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని రామాలయం నుండి అంగడిపేట హనుమాన్ దేవాలయం మీదుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా సీతారామ ఉమా మహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయల నిర్వాహకులు వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు.



హుస్నాబాద్‌టౌన్: హోమం చేస్తున్న భక్తులు

**కుకునూరుపల్లిలో...**

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 12: మండల కేంద్రంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. కుకునూరుపల్లి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



వర్గల్: హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

# ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 12: మద్దూరు మండలంలోని వంగపల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శనివారం గ్రామస్తులు భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేసి, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో కమలాకర్‌రెడ్డి, లక్ష్మినర్సింహారెడ్డి, నర్సింహారెడ్డి, జలపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కనకాచారి, రవి, కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు



బహుమతులను అందజేస్తున్న శంకర్

కోహెడ , ఏప్రిల్ 12: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై శనివారం మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త వేల్పుల శంకర్ మూడు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పుల శంకర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ గొప్ప సంఘ సంస్కర్త అని, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారన్నారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, నారాయణ, బాలతిరుపతి, గీత, స్థానికులు మమత, అజయ్, రాహుల్, ఓవేజ్, ఇలియాజ్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



అంకిరెడ్డిపల్లెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి




రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణారెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 12: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, అంకిరెడ్డిపల్లె, బందారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


**తొగుటలో..**

తొగుట, ఏప్రిల్ 12: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తొగుట సొసైటీ చైర్మెన్ హరికృష్ణారెడ్డి కోరారు. శనివారం వర్ధరాజ్‌పల్లి, గోవర్ధనగిరి, కాన్గల్, లింగంపేట, రాంపూర్, చందాపూర్, వెంకట్రావుపేట, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాలలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మాజీ మార్కెట్ చైర్మన్ కొమురయ్య, సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, ఏవో మోహన్, మాజీ సర్పంచ్ నరసింహులు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, ఆర్ఐ ఆశోక్, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, మహిపాల్‌రెడ్డి, ఎల్లయ్య, ఏఐవో సాయికుమార్, సీసీలు వరలక్ష్మి, విజయ, భాస్కర్, వీఓఏలు, గ్రామసమైక్య అధ్యక్షురాళ్లు, రైతులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బోర్డు బిల్లును రద్దు చేయాలని నిరసన



చేర్యాల: ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ, ముస్లిం నాయకులు



గజ్వేల్: అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 12: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు బిల్లును వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలోని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అందె అశోక్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు బిల్లులో ముస్లిం హక్కులపై ముస్లిమేతర సభ్యులు అజమాయిషీకి అవకాశం కల్పించడమంటే మత స్వేచ్ఛను కాలరాయడం తప్ప మరొకటి కాదన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎంఏ ముఖీమ్, కార్యదర్శి ఎండి ఆదిల్, సీపీఐ నాయకులు భూమయ్య, యాదగిరి, సుదర్శన్, నర్సయ్య, శ్రీనివాస్, మౌలానా, నవాజ్, ఎండీ ఖాజా, నజీమ్, సాబీర్, ఇమామ్, షాహీద్, సలీం, ఫహీం, హాజీపాష పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో..**

గజ్వేల్, ఏప్రిల్ 12: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దయానందరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణలు మాట్లాడుతూ... ఈ చట్టంతో వక్ఫ్ భూములు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వెళ్తాయని, అందుకు ఈ చట్టం అమలుపై ప్రభుత్వం పునరాలోచించాలన్నా రు. కార్యక్రమంలో రాజేశం, చింత శ్రీను, రమణాకర్, మల్లేశం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన భవనం ప్రారంభం



నూతన భవన ప్రారంభోత్సవంలో హరీశ్‌రావు

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 12: సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 12: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో దుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలతో దుర్గమ్మ ఆలయం వరకు సామూహికంగా వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. రెండ్రోజుల పాటు జరిగే ఆలయ వార్షికోత్సవాలకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పండుగ సందడి నెలకొన్నది.

# గులాబీ శ్రేణులు భారీగా తరలిరావాలి



చుంచనకోటలో సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

చేర్యాల, ఏప్రిల్ 12: ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభకు గులాబీ శ్రేణులు భారీగా తరలిరావాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చుంచనకోటలో బీఆర్‌ఎస్ బహిరంగ సభకు సంబంధించి సన్నాహక సమావేశం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. పెడుతల ఎల్లారెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులతో పాటు ముఖ్య కార్యకర్తలు, అభిమానులు సభకు వచ్చేందుకు ఎమ్మెల్యే అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వడ్లకొండ శ్రీనివాస్, బీసీ, మైనార్టీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**ఐనాపూర్‌లో...**

కొమురవెల్లి, ఏప్రిల్ 12: ఈనెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తి జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు తరలిరావాలని ఐనాపూర్ బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శనివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు కొమురవెల్లిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త ఉత్సాహంగా ముందుకు రావాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణాగౌడ్, మాజీ సర్పంచ్ విజేందర్, మార్కెట్ కమిటీ మాజీ మెంబర్ గోపాల్‌రెడ్డి, లక్ష్మినారాయణ, స్వామిగౌడ్, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**రాయపోల్‌లో..**

రాయపోల్, ఏప్రిల్ 12: ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు దుబ్బాక నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఉమ్మడి మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సర్వుగారి యాదవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం దౌల్తాబాద్ మండలం అహ్మద్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగెత్తి పోయారన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం నుంచి దండులా వెళ్లి గులాబీ సత్తాచాటుదామని ఆయన పిలుపునిచ్చారు.



కొమురవెల్లి: ఐనాపూర్ సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# అలయన్స్ సేవలు ప్రశంసనీయం

- క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బాలగంగాధర్ శర్మ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 12: సిద్దిపేట అలయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని, పేదలకు మరిన్ని సేవలు అందించి మన్ననలు పొందాలని క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బాలగంగాధర్ శర్మ పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని వైశ్య భవన్‌లో అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణ శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సిద్దిపేట అలయన్స్ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకొని ఆదర్శంగా నిలిచిందన్నారు. అలయన్స్ క్లబ్ దేశ, విదేశాల్లో పేదలకు సహాయం చేస్తున్నదని, కులమతాలకు అతీతంగా క్లబ్ సేవలు అందిస్తుందని, అదే స్ఫూర్తిని నూతన కార్యవర్గం కొనసాగించాలని పిలుపునిచ్చారు. నూతన గవర్నర్ గందె ఈశ్వర్ చరణ్‌తో కలిసి బాలగంగాధర్ శర్మ ముగ్గురు నిరుపేద వధువులకు పుస్తె మట్టెలు, మరో కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్లు అందించారు. ప్రమాణ స్వీకరణలో ఆత్మారాములు, వైకుంఠం, అంతయ్య, సోమ వనజ, శివకుమార్, రామచంద్రం, కృష్ణమూర్తి, ధనుంజయ్, కైలాసం, రేణుక, సుజాత, వెంకటలక్ష్మి, సత్యనారాయణ, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, మధుసూదన్, అన్నారెడ్డి, ఈశ్వరయ్య, విష్ణుమోహన్, రజని, శంకర్ పాల్గొన్నారు.




లోగో ఆవిష్కరిస్తున్న అలయన్స్ క్లబ్ ప్రతినిధులు

## బోరుమోటరు బిగింపు



బోరుమోటర్ బిగిస్తున్న దృశ్యం

గజ్వేల్, ఏప్రిల్ 12: తాగునీటి కష్టాల నుండి గట్టెక్కేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లిలో మిషన్ భగీరథ ద్వారా తాగునీళ్లు సరిపడా రాకపోవడంతో మినీట్యాంకు వద్ద బోరుమోటర్‌ను బిగించగా, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తొగుట, ఏప్రిల్ 12: మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గంను శనివారం ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా చెరుకు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చెరుకు నరేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నెపూరి వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులుగా రమణారెడ్డి, అజయ్ రెడ్డి, నారాయణరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## జడ్పీ మాజీ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న రాజు

కోహెడ, ఏప్రిల్ 12 : సిద్దిపేట జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు పిడిశెట్టి రాజు అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ప్రైవేటు దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, చల్ల మల్లారెడ్డి, గంగాధర రమేశ్, ఆదిత్య, భార్గవ్‌చారి, సాయి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సహాయం చేస్తాం



నిత్యావసర సరుకులను అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 12: వృద్ధులకు తమవంతు సహాయ సహకారం అందిస్తామని సిద్దిపేట వాసవి క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్ అన్నారు. సిద్దిపేట ఇందిరమ్మ కాలనీలో వృద్ధాశ్రమాన్ని శనివారం క్లబ్ ప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మంకాల సంతోష్ సహకారంతో నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, బాలకుమార్ సహకారంతో గ్రైండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు నవీన్‌కుమార్, సంతోష్‌కుమార్, సత్యనారాయణ, శశాంక్, రవి, మంజుల, నాగరాణి, సుప్రియ పాల్గొన్నారు.

## ఘనంగా శకటోత్సవం

బెజ్జంకి, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరోత్సవాల్లో భాగంగా శనివారం శకటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి డప్పుచప్పుళ్ల మధ్య గుట్టచుట్టూ ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ పరిసరాలు స్వామివారి నామస్మరణతో మారోగ్మింది.

## బొడ్రాయి ఉత్సవాలు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 12: మండలంలోని దౌలాపూర్‌లో బొడ్రాయి పండుగ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండోరోజు శనివారం గ్రామ ఆడపడుచులు బొడ్రాయికి నీళ్లు పోసి పూజలు చేశారు. గ్రామ దేవతలు పెద్దమ్మ, పోచమ్మ, మహంకాలమ్మ దేవతలకు బోనాలు సమర్పించారు. మూడు రోజులు పాటు ఉత్సవాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.